ఎమ్మెల్యేకు థర్మల్ సెగ

- రవికుమార్‌ను నిలదీసిన గిరిజనులు
- పెన్షన్లు నిరాకరించి నిరసన

వార్త మెయిన్‌లో

'దిత్వా' కలవరం

బూర్జలో పొలంలో నీటిని మళ్లిస్తున్న రైతు

- జిల్లాలో పలుచోట్ల తేలికపాటి జల్లులు
- రహదారులు, కళ్లాల్లో ధాన్యం కుప్పలు
- నేటికీ పంపిణీ కాని టార్పాలిన్లు
- అద్దెకు తీసుకుని అవస్థలు పడుతున్న రైతులు

దిత్వా తుపాను అన్నదాతలను కలవరపాటుకు గురిచేస్తోంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి జిల్లాలో పలుచోట్ల తేలికపాటి జల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో వరి పంటను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. యంత్రాల ద్వారా కోతలు పూర్తి చేసి రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని నింపేందుకు గోనె సంచులు, రవాణా వాహనాలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల మూడో తేదీ వరకు వర్షాలు పడతాయన్న వాతావరణశాఖ హెచ్చరికలు రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. రైతులకు ఉచితంగా టార్పాలిన్లు అందిస్తామని ప్రభుత్వం చెప్పినా అవి ఇప్పటికీ రైతు సేవా కేంద్రాలకు చేరలేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

దిత్వా తుపాను ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. ఎల్ఎన్ పేట, బూర్జ మండలం కొల్లివలస, ఆమదాలవలస, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో 1.5 మి.మీ చొప్పున వర్షం కురిసింది. లావేరు ఒక మి.మీ, సరుబుజ్జిలి మండలం విజయరాంపురం, రణస్థలం మండలం గరికపాలెంలో 0.75 మి.మీ చొప్పున వర్షం పడింది. పలాస, మందస మండలం హరిపురం, పైడిభీమవరంలో 0.25 మి.మీ వర్షపాతం నమోదైంది. వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం, పలుచోట్ల వర్షాలు కురవడం మొదలు కావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రధానంగా వరి రైతులు కొంత కలవరపాటు చెందుతున్నారు. మరోవైపు ధాన్యం చేతికొచ్చినా అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. సాంకేతిక కారణాలతో ధాన్యం కొనుగోలు మందకొడిగా సాగుతున్నాయి. మరోవైపు బ్యాంకు గ్యారంటీల సమర్పణలోనూ తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఇప్పటివరకు అది మాన్యువల్‌గా జరుగుతుండగా, ప్రస్తుత ఖరీఫ్ నుంచి ప్రభుత్వం దానిని ఈ-బిజిగా మార్చింది. దీంతో బ్యాంకు గ్యారంటీల ప్రక్రియ ఆలస్యం సాగడం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ప్రభావం చూపుతోంది.

34,200 టన్నుల ధాన్యమే కొనుగోలు

సాంకేతిక కారణాలు, బ్యాంకు గ్యారంటీల సమర్పణలో జాప్యంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు మందకొడిగా సాగుతున్నాయి. జిల్లాలో 406 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 303 కేంద్రాలే తెరుచుకున్నాయి. ఇప్పటివరకు 34,200 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించారు.

నెల రోజుల వ్యవధిలో రెండో తుపాను

గత నెల చివరిలో మొంథా తుపాను కారణంగా వర్షాలు, గాలుల తీవ్రతకు వరి చేలు నేలకొరిగింది. వేలాది ఎకరాల పంట నీట మునిగింది. వర్షాల ప్రభావంతో తేమ శాతం అధికంగా కనిపిస్తోంది. ధాన్యం నాణ్యతంగా లేకపోవడం, బ్రోకెన్ రైస్ వస్తుండడంతో ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. ఇన్ని అవస్థలు పడుతున్న సమయంలో దిత్వా తుపాను రూపంలో మరో గండం రావడంతో రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

రైతులకు పంపిణీ కాని టార్పాలిన్లు

జిల్లాలో జలుమూరు, సారవకోట, హిరమండలం, ఎల్ఎన్‌పేట, కొత్తూరు, బూర్జ తదితర మండలాల్లో ఇప్పటికే పంట కోతలు ప్రారంభమయ్యాయి. వర్షాలు పడుతుండడంతో పంటను కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొంతమంది రైతులు రూ.1200 నుంచి రూ.1400 వరకు వెచ్చించి టార్పాలిన్లు కొనుగోలు చేస్తున్నారు. మరికొంతమంది రైతులు రోజుకు రూ.30 నుంచి రూ.40 వరకు అద్దెకు తీసుకొస్తున్నారు. గతంలో 50శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందించేవారు. ఈ ఏడాది ఇప్పటివరకు టార్పాలిన్లు అందించే పని కాలేదు. టార్పాలిన్ల టెండర్లను ఖరారు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ వేణుగోపాల్ చెప్తున్నారు. జిల్లాలో 3,800 టార్పాలిన్లను సరఫరా చేయనున్నామని తెలిపారు. డిసిఎంఎస్ ద్వారా ఆర్ఎస్‌కెలకు పంపనున్నామని చెప్పారు.

5న మెగా పేరెంట్స్ సమావేశం

- తల్లిదండ్రుల హాజరు తప్పనిసరి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఈ నెల 5న ఉదయం 9 గంట నుంచి మెగా పేరెంట్స్ సమావేశం-3.0 నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో నిర్వహించిన రెండు పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రతి విద్యార్థి తరుపున తల్లిదండ్రులు ఇద్దరూ హాజరై పిల్లల భవిష్యత్‌పై ఉపాధ్యాయులతో ముఖాముఖి చర్చించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈసారి ప్రతిష్టాత్మకంగా తీసుకొని మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలలో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటవేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలలకు పిల్లలు వస్తున్నారా? లేదా? తల్లిదండ్రులు పరిశీలన చేయవచ్చన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఒక్కొక్కరు ఒక్కొక్క స్కూల్‌కు వెళ్తారని తెలిపారు. పిల్లలతో పాటు తల్లిదండ్రులు మధ్యాహ్నం భోజనం అక్కడే చేయాలని సూచించారు. భోజనం చేసి బాగా లేకపోతే అక్కడే భోజనంపై సూచనలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. పిల్లలకు సంబంధించి సమాచారాన్ని ఉపాధ్యాయులు ఇస్తారని తెలిపారు. సమావేశంలో ప్రోగ్రెస్ కూడా అడగాలన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో తల్లిదండ్రులు సూచనలు సలహాలు చేయవచ్చని స్పష్టం చేశారు. జిల్లాలో 2652 పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమావేశంలో భాగంగా 15 పాఠశాలల్లో స్టెం ల్యాబ్స్, 23 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్, 451 ఉన్నత పాఠశాలల్లో స్పోర్ట్స్ మెటీరియల్స్, 1764 పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ టిఎల్ఎం కిట్స్, 70 పాఠశాలల్లో వృత్తి నైపుణ్యం, 417 పాఠశాలల్లో కిట్స్‌తో ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బంగ్లాదేశ్ మత్స్యకారులపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

అక్రమంగా భారత సముద్ర జలాల్లో ప్రవేశించిన 13 మంది బంగ్లాదేశ్ మత్స్యకారులపై కళింగపట్నం మెరైన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు మెరైన్ సిఐ తెలిపారు. మండలంలోని మూసవానిపేట సముద్ర తీరానికి ఆదివారం బంగ్లాదేశ్ మత్స్యకారులు వచ్చిన విషయం విదితమే. వీరిని కళింగపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి, అక్కడ విచారణ చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ధాన్యం అమ్ముడుపోక రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొనారి మోహనరావు అన్నారు. మండలంలోని పూండిలో పంట పొలాల్లో నిల్వ ఉన్న ధాన్యం రాసులను సిపిఎం నాయకులు పాలిన సాంబమూర్తితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చినా కొనుగోళ్లు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 4.9 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారని అన్నారు. 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. దిత్వా తుపాను కారణంగా రైతులు కళ్లాల్లో, పొలాల్లో ధాన్యం రాసులు నిల్వ చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారని అన్నారు. నిల్వ ఉన్న ధాన్యం తడిసిపోతే తమ పరిస్థితి ఏమిటని మదనపడుతున్నారని తెలిపారు. మండలాల్లో అక్కడక్కడ ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల సాంకేతిక సమస్యలతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అదునుగా ప్రైవేట్ వ్యాపారులు, దళారులు రైతులు దోచుకుంటున్న అధికార యంత్రాంగానికి ఏమీ పట్టడం లేదన్నారు. 80 కిలోల బస్తా దగ్గర రైతులు రూ.2 నుంచి రూ.3 వందల వరకు నష్టపోతున్నారని తెలిపారు. ఎంతవరకు మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలు లేక సేకరణ మందకొడిగా సాగుతుందని తెలిపారు. పౌరసరఫరాలశాఖ మంత్రి జిల్లాలో అక్టోబరు 13న ధాన్యం కొనుగోలపై సమీక్షించినా... ఆశించిన స్థాయిలో ధాన్యం సేకరణ జరగలేదని అన్నారు. తక్షణమే రైతులకు ఎటువంటి ఇబ్బందిలేకుండా ధాన్యం సేకరణ చేసి ప్రైవేటు వ్యాపారులు, దళారుల నుంచి కాపాడాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

నిల్వ చేసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మోహనరావు

అదానీ కంపెనీకి భూ కేటాయింపులు రద్దు చేయాలి

- మత్స్యలేశం గ్రామస్తుల వినతి
- పిజిఆర్ఎస్‌కు 124 ఫిర్యాదులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గార మండలం శ్రీకూర్మం పంచాయతీ మత్స్యలేశంతోపాటు ఆరు గ్రామాలు వనసంరక్షణ సమితి పరిధిలో ఉన్న 500 ఎకరాలు భూమి అదానీ కంపెనీకి బీచ్ శాండ్ మైనింగ్ కేటాయించారని, ఈ కేటాయింపులు తక్షణమ రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల విభాగానికి వచ్చే ముందు శ్రీకూర్మంకు చెందిన ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా జడ్‌పి కార్యాలయం ఆవరణలో నిరసన తెలియజేశారు. స్థానికంగా వన సంరక్షణ సమితిలో ఉపాధి పొందుతున్న వారికి అన్యాయం చేయవద్దని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూ కేటాయింపులు రద్దు చేయకపోతే భవిష్యత్‌లో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు స్థానిక ప్రజలకు సమాచారం లేకుండా, అనుమతులు లేకుండా ఎలా కేటాయింపులు చేస్తారని అధికారులను ప్రశ్నించారు.

అలాగే శ్రీకాకుళం పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, ప్రభుత్వం మరమ్మతులు చేయాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఎన్నికలు ముందు మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం అధికారులు స్పందించడం లేదని అధికారులు వద్ద ప్రస్తావించారు. 24 బ్లాకుల్లో 360 ఇళ్లు ఉన్నాయని తెలిపారు. ఎచ్చెర్ల మండలం ధర్మవరం పంచాయతీని పాలన సౌలభ్యం కోసం విభజించాలని స్థానికులు అల్లు సూర్యనారాయణతో కూడిన బృందం వినతి పత్రం అందజేశారు. రామజోగిపేట, లావేటిపేట గ్రామాలను పంచాయతీగా ప్రకటించాలని విన్నవించారు. ఈ రెండు గ్రామాల్లో 936 మంది ఓటర్లు, రెండు వేల మంది జనాభా ఉన్నారని అన్నారు. అమదాలవలస వైసిపి నియోజకవర్గ సమన్వ యకర్త చింతాడ రవికుమార్ పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. బూర్జ మండలం లక్కుపురంలో ఆశా కార్యకర్త నియామం నిబంధనలు మేరకు జరగలేదని, రాజకీయ ప్రమేయంతో నియమించారని అధికారులకు చెప్పారు. బూర్జ మండలంలో నిబంధనలు మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు చేపట్టడం లేదని, టిడిపి నాయకులు కనుసన్నల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారని రైతులు వివరించారు. పొందూరు మండలంలో రబీ వ్యవసాయ సీజన్‌కు ఎరువులు కొరత వెంటాడుతుందని తెలిపారు. సాగునీటి కాలువ పనులకు సంబంధించి బిల్లులు అందజేయాలని ఎచ్చెర్ల మండలం ఇబ్రహింబాద్‌కు చెందిన మాజీ సర్పంచ్ సీపాన ఎర్నన్నాయుడు కోరారు. పిజిఆర్ఎస్‌కు మొత్తం అన్‌లైన్‌లో, ప్రత్యక్షంగా 124 ఫిర్యాదులు వచ్చాయి. అన్ని ప్రభుత్వ శాఖలతో ఫిర్యాదుల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షించారు. ఫిర్యాదులు పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, పలాస ఎయిర్‌పోర్టు ప్రత్యేక అధికారి ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న శ్రీకూరం గ్రామస్తులు

అతిసారపై కదిలిన వైద్యాధికారులు

రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ అనిత

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

సంతబొమ్మాళి మండలం తాళ్లవలసలో అతిసార కేసులు పెరగడంతో గ్రామంలో ఆందోళన నెలకొంది. రెండు రోజులుగా వ్యాధి లక్షణాలతో ఎనిమిది మంది బాధపడుతుండగా, వారిలో మార్పు చిన్నారావు (65) ఆదివారం మృతి చెందారు. సోమవారం మరో ముగ్గురు వాంతులు, విరేచనాలతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి చేరారు. వీరిలో 16 ఏళ్ల మార్పు అఖిల కళ్లు తిరిగి పడిపోయింది. ఆమెను వెంటనే ఏరియా హాస్పిటల్‌కు తరలించగా, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని బంధువులు తెలిపారు. గ్రామంలో రెండు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి ఆరోగ్య పరీక్షలు చేస్తూ, అవసరమైన మందులు అందిస్తున్నారు. బాధితుల రక్త నమూనాలు, గ్రామంలోని బావుల నీటి నమూనాలను పరీక్షల నిమిత్తం పంపినట్లు అధికారులు తెలిపారు.

ముఖ్యమంత్రి ఆరాతో అధికార యంత్రాంగం అప్రమత్తం

తాళ్లవలసలో అతిసార విజృంభణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం జిల్లా అధికారులను ఆరా తీశారు. బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత, డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీ కేథరిన్, వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ విభాగాలు తాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్ నిర్వహించాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు అన్ని శాఖలు సంయుక్తంగా చర్యలు కొనసాగిస్తున్నాయని అధికారులు తెలిపారు.

అప్రమత్తతతోనే ఎయిడ్స్‌కు అడ్డుకట్ట

- హెచ్ఐవి బాధితులను అక్కున చేర్చుకోవాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ర్యాలీలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎయిడ్స్ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. అప్రమత్తంగా ఉండడం ద్వారా ఎయిడ్స్‌కు అడ్డుకట్ట వేయొచ్చని చెప్పారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ బంగ్లా ప్రాంగణం వద్ద ఎయిడ్స్ అవగాహనా ర్యాలీని సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు కొనసాగింది. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి, హెచ్ఐవిపై అపోహలు, వివక్షత నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు హెచ్ఐవిపై భయపడొద్దని, బాధితులను అక్కున చేర్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఎఆర్‌టి మందులు వైరల్ లోడ్‌ను తగ్గించి వ్యాధి సంక్రమణ అవకాశాన్ని గణనీయంగా తగ్గిస్తుందన్నారు. రిస్క్ గ్రూపులకు చెందిన వారు నిరంతరం హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవి, ఎయిడ్స్ ప్రివలెన్స్ అందుబాటులో ఉన్న ఐసిటిసి, ఎఆర్‌టి కేంద్రాలు, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఎఆర్‌టి మందుల సేవల గురించి వివరించారు. గత సంవత్సరాలతో పోలిస్తే హెచ్ఐవి కేసులు తగ్గుముఖం పడుతున్నట్లు తెలిపారు. కలెక్టర్ బంగ్లాలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 60 మంది పిల్లలకు అల్పాహారం ఏర్పాటు చేసి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి సర్టిఫికెట్లు, మెమెంటోలు ప్రదానం చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.హరిబాబు, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ వికలాంగుల శాఖ ఎడి వి.శైలజ, అదనపు డిఎంహెచ్ఒ మేరీ కేథరిన్, డిసిహెచ్ఎస్ కళ్యాణ్‌బాబు, డిఎల్ఎటిఒ శ్రీకాంత్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కె.వి.ఆర్ శైలజ, ఎఆర్‌టి మెడికల్ ఆఫీసర్ అప్పలనాయుడు, హారికా కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు, లయన్స్ క్లబ్ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కార్గో ఎయిర్‌పోర్టు ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాభిప్రాయం మేరకే ముందుకు...

కార్గో ఎయిర్‌పోర్టు ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - మందస

కార్గో ఎయిర్‌పోర్టుకు సంబంధించి ప్రజాభిప్రాయం మేరకు ముందుకు సాగుతామని కార్గో ఎయిర్‌పోర్టు ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ వెంకటేష్ స్పష్టం చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్గో ఎయిర్‌పోర్టు కోసం మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని మెట్టూరు, బిడిమి, చీపురుపల్లి గ్రామాల్లో 900 ఎకరాలు అవసరమని, మిగతా ఎనిమిది గ్రామాల్లో 400 ఎకరాల భూమి అవసరమన్నారు. ఇదివరకే ల్యాండ్ మ్యాప్‌తో సహా ప్రభావిత గ్రామాల్లో ఉంచామని చెప్పారు. కార్గో పోర్టు భూసేకరణపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బాధిత గ్రామాల్లో పర్యటించి గ్రామసభలు నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. భూమి ధరను బహిరంగ మార్కెట్ రేటు కంటే రెండింతలు ఎక్కువ ఇస్తామన్నారు. కార్గో ఎయిర్‌పోర్టు వల్ల అనుసంధాన పరిశ్రమలు వస్తాయన్నారు. దీనివల్ల వలసలను నివారించవచ్చన్నారు. సమావేశంలో తహశీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ ఇంద్ర, మండల సర్వేయర్ బాబూరావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కోటబొమ్మళి, సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు సముఖానికి
O.S.No: 47/2024

Between:-
శిమ్మ కృష్ణ ....వాది
And:-
శిమ్మ సింహాచలం వగైరాలు .....ప్రతివాదులు
To,
4వ ప్రతివాది: Ravada Harika, W/o. Balakrishna, Rana Lingalavalasa Village, Rana Post, Jalumuru Mandalam, Srikakulam District, Ph. 8074264759.
7వ పతివాది: Ravada Balakrishna, S/o. Lingayya, Padmapuram Village, Saravakota Mandalam, Srikakulam District. Ph. 81063 79073.

పై నంబరు దావా లో పొందుపరిచిన దావా షెడ్యూలు లో వాది వాటా కోరకు ఆస్తి పంపకం కోరుచు పై దావా ను వేసి వున్నారు. సదరు దావా లో 4 మరియు 7 ప్రతివాదులు అయిన మీకు నోటీసు నిమిత్తం **తే 11-12-2025 దీ కి పై కోర్టు లో వాయిదా అయి వున్నది.** కావున వాయిదా నాడు పగలు **10-30 గంటలకు** పై కోర్టు వారి యెదుట హాజరై, మీకుగల ఆక్షేపణలు తెలియ పరచుకోవలెను. లేనియెడల మీ పరోక్షనందు తీర్మానించడం అగునని యిందు మూలంగా తెలియ జేయడ మైనది.

సూధా సూర్యారావు
కరణం అప్పలనాయుడు
సూధా లీల సాయి
వాది తరపు న్యాయవాదులు,
శ్రీకాకుళం, ఫోన్: 9440156922.

వేతనాలు పెంచాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

12వ పిఆర్‌సి కమిటీ నియమించి, మున్సిపల్ కార్మికులందరికీ వేతనాలు పెంచాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.బలరాం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సామూహిక రాయబార కార్యక్రమంలో భాగంగా సోమవారం అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ గత జూలైలో రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ కార్మికులు పది రోజులు, పారిశుధ్య కార్మికులు ఏడు రోజులు సమ్మె చేశారని అన్నారు. ఈ సమ్మెకాలపు జీతం చెల్లించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని, ఇందుకు సంబంధించి ఇఒ జారీను జారీ చేయాలని అన్నారు. 17 రోజుల సమ్మె సందర్భంగా అప్కాస్ ద్వారా విశ్రాంతి తీసుకున్న కార్మికులకు బెనిఫిట్స్ సంబంధించి జిఒను జారీ చేయాలన్నారు. అలాగే ఎక్స్‌గ్రేషియో రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంపుదల చేయాలన్నారు. దహన సంస్కారాలకు రూ.15 వేలు నుంచి రూ.20 వేలుకు పెంచాలన్నారు. పారిశుధ్యం, ఇంజినీరింగ్ కార్మికులకు 'తల్లికి వందనం'తో సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు డిఎ బకాయిలు, సరండర్ లీవ్‌లు ఎన్‌క్యాస్‌మెంట్ తదితర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంఆర్‌లకు ఏడేళ్లుగా జీతాలు పెంచలేదని వివరించారు. ఖాళీల భర్తీలో వీరికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి రూ.21 వేలు వేతనం చెల్లించాలన్నారు. అర్హులందరికీ ఇళ్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, మున్సిపల్ నాయకులు ఎ.జనా, ఎం.రాఘవ, ఎ.జ్యోతి, ఎ.ఢిల్లీరావు, వై.పైడిరాజు, పి.లక్ష్మి పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి రైతు సేవా కేంద్రాన్ని (ఆర్ఎస్‌కే) ధాన్యం కొనుగోలు కేంద్రంగా గుర్తించి, ప్రభుత్వం ద్వారా నేరుగా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి, సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో విక్రయించి పూర్తి మద్దతు ధర పొందవచ్చని సూచించారు. రైతులు తమకు అనువైన తేదీన ధాన్యం అమ్ముకునేందుకు వీలుగా, రైతు సేవా కేంద్రంలో గానీ లేదా వాట్సాప్ ద్వారా గానీ షెడ్యూల్ చేసుకుని కూపన్ పొందవచ్చని తెలిపారు. తమ ధాన్యాన్ని ఏ మిల్లుకు పంపించాలో రైతులే సొంతంగా నిర్ణయించుకునే స్వేచ్ఛను ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. మిల్లు మండలంలో ఎంత దూరమైనా, రవాణా ఖర్చు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలోకి ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. ధాన్యం రవాణాలో పూర్తి పారదర్శకత కోసం ధాన్యం కళ్లాం నుంచి మిల్లుకు చేరే వరకు వాహనాన్ని జిపిఎస్ పరికరం ద్వారా ప్రభుత్వం ట్రాక్ చేస్తుందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల వద్ద జిపిఎస్ పరికరం అమర్చబడిన వాహనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆ వాహనాల్లోనే రైతులు ధాన్యాన్ని తరలించాలని స్పష్టం చేశారు. ధాన్యం అమ్మకంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా టోల్ ఫ్రీ నంబరు 1967, జిల్లా కంట్రోల్‌రూమ్ నంబరు 9963479141 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్ఎస్‌కె వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయం, సమస్యలను ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

అర్జీల పరిష్కారమే లక్ష్యం

ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి

వృద్ధుని సమస్య వింటున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అర్జీదారులు సంతృప్తి పొందేలా ప్రజా ఫిర్యాదులు పూర్తి స్థాయిలో పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అధి కారులకు సూచించారు. ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక నిర్వహించగా 61 ఫిర్యాదులు వచ్చాయి. వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్‌పి అధికారులకు ఆదేశించారు.

నగదు అందిస్తున్న గ్రామస్తులు

రమేష్ కుటుంబానికి అండ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

ప్రమాదంలో భర్తను కోల్పోయి అనాథలైన బైరెడ్ల మోహిని, ఆమె ముగ్గురు చిన్నారులకు గ్రామస్తులు అండగా నిలిచారు. బాధాకర సమయంలో తమతో ఉన్నామనే ధైర్యం అందిస్తూ పెద్ద మొత్తంలో సాయం చేస్తూ ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. గొండ్యాలపుట్టుగకు చెందిన బైరెడ్ల రమేష్ విధి నిర్వహణలో ఉండగా మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో రమేష్ భార్య మోహిని, ముగ్గురు చిన్నారులు దిక్కులేనివారయ్యారు. వీరి పరిస్థితిని వివరిస్తూ నవంబరు 14న 'మావయ్య... నాన్నేరి' అంటూ 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి విశేష స్పందన లభిస్తోంది. ఆ కోవలోనే రమేష్ స్వగ్రామమైన గొండ్యాలపుట్టుగ గ్రామస్తులు తలో కొంత సహకారం అందించి మొత్తం రూ.2,67, 558లను మోహినికి అందజేశారు. కథనం ప్రచురితమైన తరువాత దాతలు అందించిన సహాయంతో ఇప్పటి వరకూ దాదాపు రూ.8 లక్షలు బాధిత కుటుంబానికి అందాయని గ్రామస్తులు తెలిపారు. 'ప్రజాశక్తి' పత్రికకు గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నెల్లిపర్తి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నెల్లిపర్తి పంచాయతీ సర్పంచ్ మానుకొండ రాజేశ్వరి చెక్‌పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య ఉత్తర్వులు జారీ చేశారు. అదే గ్రామానికి చెందిన శెట్టి నర్సింగరావు అనే వ్యక్తి పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగినట్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో దీనిపై నెల్లిపర్తి పంచాయతీ కార్యాలయంలో ఇటీవల జిల్లా పంచాయతీ అధికారులతో పాటు మండల పంచాయతీ అధికారులు విచారణ నిర్వహించారు. ఈ విచారణలో పంచాయతీకి చెందిన 2022 - 2023 నుంచి 2024 - 2025 వరకు మంజూరైన సాధారణ నిధులు రూ.3,42,696 అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2,44,019 మొత్తం 5,86, 715 నిధులు పంచాయతీ రాజ్ నిబంధనలకు విరుద్ధంగా దుర్వినియోగం చేసినట్లు రుజువు కావడంతో దీనిపై ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సదరు సర్పంచ్ చెక్ డ్రాయింగ్ పవర్ తాత్కాలికంగా ఆరు నెలలు నిలుపుదల చేయుటకు చర్యలు తీసుకోవడం జరిగిందని, వీటిని వెంటనే అమలు పర్చాలంటూ మండల పంచాయతీ అధికారికి ఆదేశాల జారీ చేసినట్లు డిపిఒ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సదరు సర్పంచ్ చెక్ పవర్ ఉత్తర్వులపై ఎటువంటి అభ్యంతరాలున్నా జిల్లా కలెక్టర్‌కు అపీల్ చేసుకోవాలని, ఈ విషయంపై కలెక్టర్ ఆదేశాలే తుది చర్యలుగా పరిగణించబడతాయని డిపిఒ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న సునీల్‌రాజ్‌కుమార్

ఉత్తీర్ణతా శాతం పెంపునకు చర్యలు

ప్రజాశక్తి- కంచిలి

విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి పది, ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహణలో మరింత శ్రద్ధ వహించాలని అడిషనల్ సెక్రటరీ సునీల్ రాజ్‌కుమార్, జిల్లా గురుకులాల సమన్వాధికారి వై.యసోదలక్ష్మి సూచించారు. కంచిలి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అర్ధాంతరంగా నిలిచిపోయిన నాబార్డు భవనాలను పూర్తి చేయడానికి రూ.35 లక్షలు, అసంపూర్తిగా నిలిచిపోయిన నాడు-నేడు భవనాలను పూర్తి చేయడానికి రూ.30 లక్షలకు సంబంధించి అనుమతులను తక్షణమే ఎస్టిమేషన్ ప్రాప్తికి పంపిస్తామని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావుని కొత్త డార్మిటరీ నిర్మాణానికి రూ.4.5 కోట్లకు ఎస్టిమేషన్‌ని తయారుచేసి పంపించమని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న కొత్త వాలీబాల్ కోర్టును పరిశీలించారు. ట్రిపుల్ ఐటి, నీట్‌కు సంబంధించిన ప్రత్యేక శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. అనంతరం పిల్లల భోజనాలు పర్యవేక్షించి వారితో పాటు భోజనాలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పి.ఎం.జె.బాబు, ఎఇ సునీల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ

ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బూర్జ : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.శ్యాంసుందర్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ నివారణ అవగాహనపై పలు నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాతీయసేవా పథకం అధికారి జె.రవి, చరిత్ర అధ్యాపకులు కె.రాజారావు, జంతుశాస్త్ర అధ్యాపకులు భాస్కరరావు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ఎయిడ్స్, హెచ్‌ఐవిపై అవగాహన కల్పించారు. రెడ్‌రిబ్బన్ లోగో ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుష్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి పైల శశిధర్, రిబ్బన్ క్లబ్ నోడల్ అధికారి నల్ల ఢిల్లేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రవీంద్రనాథ్ ఠాగూర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వైద్యాధికారి రాజశేఖర్ హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. సిహెచ్‌ఒ అప్పలస్వామి, సూపర్‌వైజర్ సరోజిని, స్టాఫ్‌నర్స్, ఎఎన్ఎం, ఫార్మసిస్టు తదితరులున్నారు.

అరసవల్లి: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా హర్షవల్లి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 200 మందికి న్యూట్రిషనల్ అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లైన్స్‌క్లబ్ సభ్యులను ప్రశంసిస్తూ క్లబ్ సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సేవ చేయడంలో లయన్స్ క్లబ్ ముందుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కరణం హారికాప్రసాద్, డాక్టర్ మేడిశెట్టి సత్య స్వరూప్, వావిలపల్లి జగన్నాథ నాయుడు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, డాక్టర్ హారికా చందక నీహార్ నాయుడు, సుమన్, లక్ష్మణ్, పార్వతీశ్వరరావు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని కొండములగాం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఐవి ఐసిటిసి కౌన్సెలర్ జి.శ్రీధర్, సిహెచ్‌సి వైద్యాధికారులు పి.లలిత, యు గంధర్, పద్మావతి, ప్రసన్నలక్ష్మి, వంశీప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఐసిటిసి ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆస్పత్రి నుంచి అంబేద్కర్ కూడలి వరకూ ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ, ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వినోద్, లక్ష్మి, సురేఖ, హేమలత, ఐసిటిసి కౌన్సిలర్ నాగవళి, బెజ్జిపురం యూత్‌క్లబ్ సభ్యులు, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి) శ్రీకాకుళం ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె. అనిత ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వండాన శిమ్మన్న, కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రెటరీ చిన్నాల రాము, ఇసి మెంబర్స్ ముసలనాయుడు, జి. గిరి బాబు, కింజరాపు రాజారావు, కె.ఆనందరావు, పద్మావతి పాల్గొన్నారు.

నరసన్నపేట: సమాజంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన పెంచాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత సూచించారు. విద్యార్థులతో ఎయిడ్స్ నివారణ చర్యలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాంతిహేమ, అధ్యాపకులు రవికుమార్, అన్నాజీరావు, త్రినాథరావు, ఢిల్లేశ్వరరావు, పవిత్ర, శ్రీవిద్య పాల్గొన్నారు.

సోంపేట : ఎయిడ్స్ నివారణపై బారువ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ జోగి గౌతమ్ ఆధ్వర్యాన డిగ్రీ కళాశాల విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బారువ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఐసిటిసి కౌన్సిలర్ హనుమంతు నాగభూషణరావు, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ టి.రాజేంద్ర ప్రసాద్, పి.స్నేహలత, శివాజీ, హెడ్‌నర్స్ ఇందిర పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కలశాల ఎన్‌ఎస్‌ఎస్, ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ఆధ్వర్యాన దాసన్నపేట నుంచి అవగాహనా ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, వైద్యాధికారులు అనూష, శిల్ప, గౌతమి, నీలిమ, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ సంతోష్‌కుమార్, ఐసిటిసి కన్వీనర్ రాజశేఖర్, గెస్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రవి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లఖినేని శ్రీనివాస్ సామాజిక ఆస్పత్రి వద్ద న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పొన్నాడ గణేష్, కోర్డు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి : ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ, టెక్కలి ప్రభుత్వాస్పత్రి ఎఆర్‌టి సెంటర్ కంట్రోలర్ విభాగం నిర్వాహకులు పి.నేతాజీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, జాతీయ విభాగం పిఒలు కందిగోల్ల, వాసుబాబు, వి.లూక్‌పాల్ పాల్గొన్నారు.

అరసవల్లి : ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్

పొందూరు : ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

కొత్తూరు : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

స్థానిక ప్రణవి డిగ్రీ కళాశాల ఆవరణలో చైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు ఆధ్వర్యాన విద్యార్థులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పేడాడ ఆజాద్ చంద్రశేఖర్, అధ్యాపకులు ఎన్.కృష్ణారావు, కర్రి వెంకటరావు పాల్గొన్నారు.

స్థానిక బిఎస్‌జెఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ కోత శ్రీనివాసరావు అధ్యక్షతన విద్యార్థులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు బ్రాహ్మజీ పాల్గొన్నారు.

కొత్తూరు : ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సందర్భంగా వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు లీలారావు, హేమంత్, చైతన్య, ప్రిన్సిపాల్ జి.కృష్ణారావు, ఐటిసి కౌన్సిలర్ సిహెచ్.భాస్కరరావు, అధ్యాపకులు జి.మహేష్‌బాబు, కె.హరిప్రసాద్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

2025 డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో ఐదు రోజుల పాటు జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. జనవరి 4న విశాఖపట్నం ఆర్.కె.బీచ్ వద్ద జరిగే భారీ బహిరంగ సభలో కార్మికవర్గం పాల్గొనాలని కోరారు. సోమవారం రణస్థలం మండలంలో ఫ్రింజ్ లేబోరేటరీస్ వద్ద సిఐటియు అఖిల భారత మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందన్నారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గ పోరాటాలను నిర్మించేందుకు ఈ మహాసభలు దోహద పడతాయన్నారు. కార్మికవర్గం త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్‌ల ప్రయోజనాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఫ్రింజ్ లేబోరేటరీస్ యూనియన్ నాయకులు ఎస్.లక్ష్మణరావు, పి.త్రినాథ్, బి.ప్రసాద్, రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

పోస్టర్లు ప్రదర్శిస్తున్న నాయకులు

సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికారి సంస్థలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార దినుసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హర్షవల్లి లైన్స్‌క్లబ్ కిట్లును హెచ్‌ఐవి సమూహ సభ్యులకు అందజేశారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, చైర్మన్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జునైడ్ అహమ్మద్ మౌలానా పాల్గొన్నారు. సమాజంలో మంచి పనులు చేసేవారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ ప్రతినిధులు కరణం హారికాప్రసాద్, డాక్టర్ మేడిశెట్టి సత్యస్వరూప్, వావిలపల్లి జగన్నాథ నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

కిట్లు అందజేస్తున్న జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

మాట్లాడుతున్న ప్రసాదరావు

కళాసీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

కళాశీల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కార్మికుల సంఘ కార్యదర్శి పోలాకి ప్రసాదరావు డిమాండ్ చేశారు. మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో జట్టు ముఠా కళాసీల కార్మిక సంఘం మండల మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీలకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. హమాలీలా సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాలకు హెచ్చరించారు. జిల్లాలో హమాలీలు అతి తక్కువ వేతనాలతో దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. పిఎఫ్, ఇఎస్‌ఐ ఎనిమిది గంటల పని దినం ఉంటే కార్మిక చట్టాలు ఏ ఒకటి అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మికులు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ఐఎల్‌ఒ నిబంధనలు ప్రకారం 50 కేజీల బస్తా ఉపయోగించాలని, కానీ జిల్లాలో ఎక్కడా ఉపయోగించడం లేదని అన్నారు. యాజమాన్యాలు కార్మికులతో అధిక బరువుల మోయించడంతో కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలన్నారు. ఏడాదికి రెండు జతల దుస్తులు ఇవ్వాలన్నారు. బోనస్ అమలు చేయాలన్నారు. కార్మికశాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి కార్మిక చట్టాలు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులందరికీ ప్రమాద బీమా అమలు చేయాలన్నారు. అనంతరం మండల జట్టు కళాసి సంఘాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల సంఘ అధ్యక్షులు మధ్య దూర్వాసులు, ఉపాధ్యక్షులు దారపు దామోదరరావు, రమేష్, నిరంజన్, ఉమామహేశ్వరరావు, హరీష్, రమేష్, బుడ్డయ్య, కేశవరావు, శ్యామ్, ఆనంద్, నల్లయ్య పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది

విద్యార్థులకు ఉద్యోగావకాశం

ఆమదాలవలస: మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన మెకానికల్ బ్రాంచ్‌కు చెందిన 26 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశం కలిగినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామ్ తెలిపారు. చెన్నైలోని రాణే (మద్రాస్) లిమిటెడ్ కంపెనీలో ఇండస్ట్రియల్ శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అవ్వడంపై ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేశారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

టెక్కలి రూరల్ : కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబరు కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి హనుమంతు ఈశ్వరరావు, నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. ఈ నెల 31న నుంచి నిర్వహించనున్న అఖిలభారత సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సోమవారం సిఐటియు కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, పని గంటలను పెంచడం, చట్టాలను కేంద్ర ప్రభుత్వం కుదించి వారి హక్కులపై దాడి చేశారన్నారు. కార్మిక హక్కుల రక్షణ కోసం తిరిగి పోరాటాలు చేయాలన్నారు. హెచ్.మోహనరావు, జి.రామ చంద్రు దు, తులసి, బోన లక్ష్మి, సిటి మోహన్, వి.రాంబాబు పాల్గొన్నారు.

సుందరంగా కొత్తమ్మతల్లి ఆలయం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: సర్వాంగ సుందరంగా కొత్తమ్మతల్లి ఆలయం అభివృద్ధి చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు అన్నారు. కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మతల్లికి అనుకొని ఉన్న మండపం, భోజనశాల పూర్తిగా తొలగిస్తామన్నారు. అమ్మవారి విగ్రహం చుట్టూ విస్తరణ పెంచుతామన్నారు. పక్కనే ఉన్న పిఎసిఎస్ కార్యాలయాన్ని అమ్మవారి ఆలయ ఆధీనంలోకి తీసుకుని మండల పరిషత్ సమీపంలో వారికి స్థలం కేటాయించాలని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తికి ఆదేశించారు. స్థలాన్ని స్వచ్ఛందంగా వచ్చి సుసరావు సూరిబాబుకు, కీర్తిశేషులు పట్నాయకుని వెంకటేశ్వరరావు కుమారుడు రమణమూర్తిలకు అభినంది ంచారు. కొత్తమ్మతల్లి పాలకమండలి అధ్యక్షులు కోరాడ గోవిందరావులు అలయ అభివృద్ధికి రూ.3 లక్షలు విరాళంగా అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి స్థపతి పరమేశ్వరప్ప, గ్రామ పెద్దలు తంగుడు కృష్ణస్వామి, కల్లి లక్ష్మణరెడ్డి, నాగయ్యరెడ్డి, కళింగ కోమటి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్, పిఎసిఎస్ అధ్యక్షులు వెలమట విజయలక్ష్మి, మాజీ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటి ఉపాధ్యక్షులు బాడాన వెంకటరమణమ్మ, ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాకృష్ణ, తహశీల్దార్ అప్పలరాజు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నారాయణరావు పాల్గొన్నారు. అనంతరం ఎన్‌టిఆర్ భవనంలో 35 మంది లబ్ధిదారులకు రూ.26, 86,327 లక్షలు సిఎం సహాయనిధి చెక్కులను అందజేశారు.

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సు, వ్యాను

ట్రావెల్ బస్సు, వ్యాను ఢీ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని లోలుగు వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన ట్రావెల్ బస్సు, వ్యాన్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలుకాగా పలువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్ఐ వి.సత్యనారాయణ, స్థానికుల వివరాల మేరకు పొందూరు నుంచి భువనేశ్వర్ వైపు వెళ్తున్న ట్రావెల్ బస్సు చిలకపాలెం నుంచి సిమిలిగూడకు వెళ్తున్న వ్యాన్‌ను బలంగా ఢీకొంది. దీంతో బస్సు, వ్యాన్ ముందు భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వ్యాన్ డ్రైవర్ దేవాశిస్ బడజానా తీవ్రంగా గాయపడి సీటులో ఇరుక్కుపోయాడు. పోలీసులు జెసిబి సాయంతో ఇర్కుక్కుపోయిన డ్రైవర్‌ను జాగ్రత్తగా బయటకు తీయగా రెండు కాళ్లు తీవ్ర గాయాలయ్యాయి. 108 సహాయంతో శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించి చికిత్సను అందించారు. అలాగే బస్సులో ఉన్న కొందరికి స్వల్పగాయాలయ్యాయి. అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోగా 3గంటల వరకూ జెసిబితో వాహనాలను తొలగించేందుకు శ్రమించారు. దీంతో సుమారు మూడు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఆ సమయంలో ప్రయాణాలు సాగించిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రమాదంపై వ్యాన్ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఉద్యోగులు

సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మృతి

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పలాస మండలం వీరరామచంద్రాపురానికి గుంట రాజు (31) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రాజు అయ్యప్ప మాల వేశారు. శబరిమల యాత్రకు తోటి స్వామిలతో వెళ్లారు. రామేశ్వరం సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రాము అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గొప్పిలి సర్పంచ్ పల్లి జయసుధ యోగి, టిడిపి మండల కార్యదర్శి లఖిదాసుపురం వాసు, మాలతి ఢిల్లీరావుల ఆధ్వర్యాన సచివాలయంలో సంతాప సభ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి రాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు.

మాట్లాడుతున్న సిఐ చిన్నంనాయుడు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన బదన సింగ్‌ను అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి 2.770 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సిఐ మీసాల చిన్నం నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఎం.తోటూరు కూడలి, రైల్వే క్రాసింగ్ గేటు దగ్గరలో గంజాయితో పట్టుబడిన నిందితుడిని అరెస్టు చేశామన్నారు. అలాగే ఫోనల్నుఉ స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ ఆర్.జనార్ధనరావు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం

సుధారాణి

శ్రీకాకుళం సిటీ: స్థానిక ఎపిహెచ్‌బి కాలనీకి చెందిన పి.సుధారాణి (65) సోమవారం మృతి చెందారు. నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు ఉమామహేశ్వరరావు (రిటైర్డ్ రెవెన్యూ ఆఫీసర్) రెడ్‌క్రాస్‌కు సమాచారం ఇచ్చారు. మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ పూతి సుజాత, చిన్నికృష్ణ ఆమె కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. నేత్రదానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు చెప్పారు. 7842699321 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వరి కుప్ప దగ్ధం



పరిశీలిస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని జాడు పల్లికి చెందిన రైతు కలమట సూర్యనారాయణకు చెందిన వరి కుప్ప దగ్ధమైంది. ఆదివారం రాత్రి పొలం ఉన్న వరి చేను నుంచి మంటలు ఎగసిపడటంతో గ్రామస్తులు స్పందించి మంటలను అదుపు చేశారు. దీంతో బాధిత రైతు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో కష్టాలు పడి పండించిన పంటను గుర్తు తెలియని వ్యక్తులు నాశనం చేశారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి సహాయం చేయాలని కోరారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నరసన్నపేట : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి - లావేరు

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. సోమవారం గుమ్మలంలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓ వృద్ధురాలు నివసిస్తున్న పూరిపాకలోకి వెళ్లి పింఛను నగదు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు అందరికి సంక్షేమం అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడుపుతున్నారన్నారు. అలాగే తాళ్లవలసలో టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత, టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, లావేరులో మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, ఎస్ఎంసి చైర్మన్ లంకలపల్లి రాంబాబు తదితరులులు ఫించన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.వెంకటరాజు, టిడిపి నాయకులు మజ్జి రామమూర్తి, బుడతవలస ఎంపిటిసి ముల్లు సాయికుమార్, మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహన్, గొర్లె శ్రీనివాసరావు, దుర్గాసి రాంబాబు, ముప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : మండలంలోని తెప్పలవలసలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని రాగోలు పంచాయతీ బావాజీపేటలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రకాశరావు, టిడిపి నాయకులు జి.శ్యామలరావు, చిట్టి మోహన్, రమణయ్య పాల్గొన్నారు.

నరసన్నపేట : మండలంలోని గోపాలపెంటలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్మన్ దామోదర నర్సింహులు, నరసన్నపేట వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాగోటి ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బెందాళం రమేష్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరింగి మధు, ఆరింగి త్రివిక్రమరావు, టిడిపి మండల అధ్యక్షుడు వజ్జ రంగారావు, ప్రధాన కార్యదర్శి బెందాళం తిరుమల కుమార్, బెందాళం సురేష్, ప్రగడ మణిబాబు, తెప్పల మోహనరావు, గార గిరి పాల్గొన్నారు.

కవిటి : పింఛను పంపిణీ చేస్తున్న రమేష్

లావేరు : వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్ తదితరులు

శ్రీకాకుళం రూరల్ : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

బావాజీపేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందజేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. సోమవారం మండలం రాగోలు పంచాయతీ బావాజీపేటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బావాజీపేట ఎస్‌సి కాలనీలో గతంలో నకిలీ ధ్రువ పత్రాలను మంజూరు చేశారని స్థానికులు తెలపగా సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను తెలుసుకొని, అర్హులందరికీ ప్రభుత్వం ప్రకటించే విధంగా మూడు సెంట్లు భూమి చొప్పున ఇళ్ల పట్టాలను అందజేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. సంబంధిత రెవెన్యూ, హౌసింగ్ అధికారులకు ఆదేశాలిస్తూ ప్రణాళికలను తయారు చేయాలని కోరారు. బావాజీపేటలో ముఖ్యంగా తాగునీటికి, సాగునీటికి, మురుగునీటి సమస్యకు గ్రామంలో కాలువలు అవసరమైన మేరకు నిర్మించేందుకు ప్రణాళికలను తయారు చేసేందుకు అధికారులకు ఆదేశించారు. అనంతరం గ్రామంలోని వీధులను, డ్రైనేజీలను పరిశీలించారు. ఆయనతో పాటు ఇఇపిఆర్‌డి సూర్యనారాయణ, టిడిపి నాయకులు చిట్టి మోహన్, గేదెల శ్యామలరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు తదితరులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలం పెద్ద కొంగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. తమ ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు రైతుసేవా కేంద్రాల ద్వారా అమ్ముకోవచ్చునన్నారు. ధాన్యం రైతుసేవా కేంద్రానికి చేరిన 48 గంటల్లోపు తమ ఖాతాల్లో సొమ్ము జమవుతుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే వ్యవసాయ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎఎస్‌ఐను సన్మానిస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి, అధికారులు

శేష జీవితం సంతోషంగా ఉండాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా పోలీసు శాఖలో 35 ఏళ్లు సేవలందించిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.జిన్నారావు ఉద్యోగ విరమణ చేశారు. జిల్లా పోలీసు యంత్రాంగం తరుపున జిల్లా ఎస్‌పి కెవి మహేశ్వర రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో దుశ్శాలువతో సన్మానం చేసి, సత్కరించారు. ఆయన అందించిన విధులకు గుర్తుగా జ్ఞాపికతో పాటుగా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ దీర్ఘకాలంగా ప్రజల రక్షణలో, నేర నియంత్రణలో, శాంతి భద్రతల పరిరక్షణలో సేవలు ప్రశంసనీయమైనవని, విధి నిర్వహణలో చూపిన కర్తవ్య నిష్ఠ, క్రమశిక్షణ ప్రతిఒక్కరికీ ఆదర్శమని అభినందించారు. ఉద్యోగ విరమణ అనంతరం జీవితం సుఖశాంతులతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమావేశంలో అదనపు ఎస్‌పిలు కె.వి రమణ, పి.శ్రీనివాసరావు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.కృష్ణంనాయుడు, ట్రెజరర్ భుజంగరావు, కార్యవర్గ సభ్యులు జగదాంబ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అప్పన్నకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

డిప్యూటీ ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు డిప్యూటీ ఎంపిడిఒ, మండల జిఎస్‌డబ్ల్యుఎస్‌గా సోమవారం దుంపల అప్పన్న బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావుకు జాయినింగ్ రిపోర్టును అందజేశారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం, దుశ్శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. ఈయనకు డిప్యూటీ ఎంపిడిఒ పి.సింహాచలం, జూనియర్ సహాయకులు కె.ఆంజనేయులు, సునీల్‌రాజ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

బిఎస్‌ఎఫ్ ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

సరిహద్దు సంరక్షకులకు సలాం

ప్రజాశక్తి- కవిటి

భారతీయ విద్యాకేంద్రం ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాలలో సోమవారం జాతీయ సరిహద్దు భద్రత దళాల దినోత్సవం నిర్వహించారు. దేశ సరిహద్దుల్లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా నిలిచి రక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సైనికుల సేవలను ప్రధానోపాధ్యాయుడు ఎం.అనిల్ ప్రశంసించారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. భారత త్రివిధ దళాలు దేశాభివృద్ధికి చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, కృష్ణకుమార్, సుహాసిని, ఢిల్లీరావు, మాదికమ్మా జ్యోతి, అంజలి జ్యోతి, లక్ష్మి, రాజేశ్వరి, సరిత, నిర్మల, ఝాన్సీ, ధర్మారావు పాల్గొన్నారు.

ముగిసిన గ్రిగ్స్ పోటీలు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని రాజపురం ఆదర్శ పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభమైన గ్రిగ్స్ క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా సోమవారంతో ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ విభాగాల్లో బాలబాలికలు చక్కటి ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన క్రీడాకారులు రాబోయే 8 నుంచి ఇచ్ఛాపురం క్రీడా మైదానంలో నిర్వహించనున్న నియోజక వర్గస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు మండల ఎంఎస్ఒ ఎం.తోటరావ్ తెలిపారు. ఈ పోటీల కోసం వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.నేతాజీ పర్యవేక్షణలో క్రీడా వేదికలను సక్రమంగా సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడల నిర్వహణలో మండల విద్యాశాఖ అధి.కారులు ధనుంజయ మజ్జి, సనపల రామకృష్ణ, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గౌతమ్ తదితరులు కీలక పాత్ర వహించారు.

ఇచ్ఛాపురం : సురంగి రాజా క్రీడా మైదానంలో నిర్వహించిన మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్, కబాడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో బాల, బాలికలకు జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలు ఈనెల 8 9 10 తేదీల్లో నిర్వహించనున్న జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ పోటీలను ఎంఇఒలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం పర్యవేక్షించారు. కార్యక్ర మంలో జోన్-1 వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కె పద్మనాభంరెడ్డి, ఎంఎస్ఒ కృష్ణపోడియా పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ప్రతిభా పరీక్షలో మెరిసిన తరుణ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన పి.తరుణ్ బివిఆర్ మెమోరియల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనపరిచాడు. జిల్లాలోని ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సాహించే ఉద్దేశంతో ప్రతిఏడాది నిర్వహించే బివిఆర్ మెమోరియల్ టాలెంట్ టెస్ట్ ఈ ఏడాది జెఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో రణస్థలం మండలంతో పాటు జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పరీక్షలో ప్రశ్నాపత్రం నైపుణ్యాన్ని అవగాహనను పరీక్షించే విధంగా రూపొందించగా ఈ పోటీలో పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ లక్ష్మీ నగర్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి పి.తరుణ్ అసాధారణ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. తరుణ్ ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు ఆయనకు రూ.10 వేలు నగదు బహుమతి ప్రధానం చేశారు. విద్యార్థుల ఆత్మవిశ్వాసం పెంపొందించి మరింత ఉన్నత లక్ష్యాల సాధనకు ఈ టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. తరుణ్ విజయం సాధించడంపై పాఠశాల హెచ్‌ఎం పి.వి.రమణమ్మ, ఉపాధ్యాయులు చింతాడ వెంకట సత్యనారాయణ మూర్తి, ఇతర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

తరుణ్‌కు నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పేదల సంక్షేమమే ధ్యేయం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని కొల్లిపాడులో సోమవారం నిర్వహించిన ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ సొంత ఇళ్లు కల్పించడమే లక్ష్యమని అన్నారు. ప్రతినెలా 1నే పింఛన్లు అందించడం ప్రభుత్వ సంకల్పమన్నారు. టిడిపి ప్రభుత్వమే పింఛను మొత్తాన్ని ఎక్కువగా పెంచిందన్నారు. రైతుల ధాన్యం కొనుగోలు చేసిన నాలుగు గంటల్లోనే డబ్బులు ఖాతాల్లో జమ చేస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదేనని అన్నారు. మండలంలో రూ.5 కోట్ల విలువైన రహదారి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ భూ సర్వే అస్తవ్యస్తంగా జరిగి ప్రజలకు ఇబ్బందులు కలిగించిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంపై వైసిపి నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కృష్ణమూర్తి, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించని సంస్థలపై చర్యలు

శ్రీకాకుళం సిటీ: జిల్లాలోని అన్ని ప్రైవేట్ వ్యాపార సంస్థలు తప్పనిసరిగా కార్మిక చట్టాలను, కనీస వేతనాలను అమలు చేయాలని ఉప కార్మిక కమిషనర్ కె.దినేష్ కుమార్ స్పష్టం చేశారు. జిల్లాలో కనీస వేతనాలు అమలు చేయని సంస్థలపై ఉప కార్మికశాఖ ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో భాగంగా ఆన్‌లైన్‌లో తనిఖీకి ఎంపికైన కొన్ని దుకాణాలు, సంస్థలు తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయా సంస్థల్లో పనిచేస్తున్న 13 మంది కార్మికులకు కనీస వేతనాల చట్టం ప్రకారం చెల్లించాల్సిన దానికంటే తక్కువ వేతనాలు ఇస్తున్నట్లు గుర్తించి యజమానుల నుంచి తేడా వేతనంగా మొత్తం రూ.1,87,378ను రికవరీ చేసినట్లు చెప్పారు. తమ కార్యాలయంలో డిమాండ్ డ్రాఫ్ట్‌ల రూపంలో కార్మికులకు సోమవారం చెక్కులను అందజేశామన్నారు. కనీస నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్మికులకు న్యాయం జరిగేలా తమ శాఖ చర్యలు కొనసాగిస్తుందని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో భాగంగా 13 మందికి సంబంధిత యాజమాన్యాల ద్వారా నియామక పత్రాలు జారీ చేయించామన్నారు. వారికి కేంద్ర ప్రభుత్వ ఈ-శ్రమ్ నమోదు ప్రక్రియనూ పూర్తి చేశామన్నారు.

డిడిలు అందజేస్తున్న కార్మికశాఖ అధికారులు

ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- నరసన్నపేట

మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు సదాశివుని కృష్ణ, గౌరవాధ్యక్షులు గురుగుబిల్లి నరసింగరావు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ ఎన్నికలో అధ్యక్షునిగా గంగు మన్మథరావు, నిర్వాహక అధ్యక్షునిగా తండ్యేల జనార్ధనరావు, ఉపాధ్యక్షునిగా సారవకోట విశ్వేశ్వరరావు, నెయ్యిల నారాయణరావు, కార్యదర్శిగా పంగ వెంకటరమణ, సంయుక్త కార్యదర్శులుగా మెట్ట శరత్, గిరిధరరావు, ట్రెజరర్‌గా నెయ్యిల మధుసూదనరావు, గౌరవ సలహాదారులుగా భమిడిపాటి గౌరీశంకర్ ఎన్నికయ్యారు.

త్రోబాల్ ఆడుతున్న ఉపాధ్యాయులు

మహిళా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

పోలాకి: పోలాకి ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో సోమవారం మహిళా ఉపాధ్యాయులు మండల లెవల్ త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యాన ప్రధానోపాధ్యాయులు ఆర్.లక్ష్మి టీమ్ డివిజన్‌స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం.నీలం, ఉపాధ్యాయులు, పిఇటిలు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

మంత్రిని కలిసిన గోవిందరాజులు

కోటబొమ్మాళి: వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కళింగకోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కళింగకోమటి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కారణంగా ఎన్‌టిఆర్ భవనంలో కలిసి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి బలోపేతానికి కృషి చేస్తానని గోవిందరాజులు తెలిపారు. అనంతరం గోవిందరాజును మంత్రి సన్మానించారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న నిబ్రం

పాతపట్నం పిఎసిఎస్ సందర్శన

మెళియాపుట్టి. పాతపట్నంలోని గిరిజన ప్రాథమిక సహకార సంఘం కార్యాలయాన్ని ఎపి గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ నిమ్మల నిబ్రం సోమవారం సందర్శించారు. ఎన్ని జిసిసి భవనాలు, ఎన్ని ఉత్పత్తులు సమగ్ర నివేదిక తీసుకుని అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. త్వరలో ఈ సమస్యలు పరిష్కార దిశగా చర్యలు తీసుకుని మారుపలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సలసాన షణ్ముఖరావు, గిరిజనసేన నాయకులు లక్ష్మీపురం కిరణ్ పాల్గొన్నారు.

6న సాయుధ దళాల పతాక దినోత్సవం

శ్రీకాకుళం సిటీ: సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఈనెల ఆరో తేదీన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. సాయుధ దళాల పతాక నిధి విరాళాలను విరివిగా అందించి మాజీ సైనికుల సంక్షేమానికి తోడ్పాటు అందించాలన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సైనిక దళాలు మొక్కవోని దీక్షతో చూపిన దేశభక్తి, సాహసం, త్యాగాలపై దేశం గర్విస్తోందన్నారు.

డిటిఎఫ్ నాయకుల ప్రకటన అర్ధరహితం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తాడివలస ఉన్నత పాఠశాలలో జరిగిన ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు జరిగిన విచారణపై డిటిఎఫ్ నాయకులు ఖండిస్తూ చేసిన ప్రకటనలు అర్ధరహితమే కాకుండా హాస్యాస్పదంగా ఉందని తాడివలస సర్పంచ్ తమ్మినైన మణెమ్మ, పిఎంసి చైర్మన్ తమ్మినైన అమ్మాజీ అన్నారు. సోమవారం వారు పత్రికా ప్రకటనను విడుదల చేశారు. పాఠశాలలో డిప్యూటీ డిఇఒ చేసిన విచారణపై డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, గౌరవ అధ్యక్షులు ఖండిస్తూ చేసిన ప్రకటనలు అవాస్తవమని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న విలువైన చెట్లును కొట్టేసి వాటిని అమ్ముకుని నిధులను దుర్వినియోగం చేయడమే కాకుండా సర్పంచ్ భర్త, ఎంపిటిసి అనుచరులు చెబితేనే వాటిని అమ్మడం జరిగిందని అనడం సరికాదని తెలిపారు. నిధులు వినియోగించేటప్పుడు పిఎంసి సమావేశం నిర్వహించి తీర్మాణం చేయాలని, నిధులను పాఠశాల ఖాతాకు జమ చేయాలని హెచ్‌ఎంకు తెలియదా అని ప్రశ్నించారు. హెచ్‌ఎంకు గతంలో పాఠశాలలో పనిచేసిన ఒక ఉపాధ్యాయుడు దన్నుతోనే నిధుల దుర్వినియోగానికి, అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. పాఠశాలలో జరిగిన నిధుల దుర్వినియోగంపై శాఖాపరమైన విచారణ కాకుండా ఆర్‌డిఒ స్థాయి అధికారి లేదా జ్యుడీషియల్ విచారణ జరిపించాలని కోరారు.

మణెమ్మ, అమ్మాజీ

అభినందిస్తున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

మాణిక్యపురం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కవిటి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాణిక్యపురం విద్యార్థులు క్రీడారంగంలో మరోసారి ప్రతిభ చాటారు. నవంబరు 27-29 తేదీల్లో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించిన అండర్-17 బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పదో తరగతి విద్యార్థులు పత్రి వాసుదేవ్, జీతా నాయక్, జయశ్రీ దోలాయ్ మెరిసి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ టోర్నీలోనే బాలుర విభాగంలో ఎలమంచి కార్తీక్, పత్రి వాసుదేవ్, కాళిదాసు సాహూ రజత పతకాన్ని సాధించి పాఠశాల గౌరవాన్ని పెంచారు. అలాగే అథ్లెటిక్స్ విభాగంలో సమీరా బిస్వాయి అండర్-16 జావెలిన్ త్రో (జిల్లాస్థాయి ఖేలో ఇండియా అస్మిత లీగ్)లో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. విజేతలను అభినందించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఇఒ ధనుంజయ మజ్జి, ప్రధానోపాధ్యాయులు మజ్జి వైకుంఠరావు పాల్గొని విద్యార్థులను అభినందించారు. విజేతల ప్రతిభను తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు రవికుమార్ మహంతి, మద్రిపాటి తోటారావును నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

జాతీయ సేవ పథకం ద్వారా విద్యార్థులకు సేవా దృక్పథం అలవాడుతుందని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పి.ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి రమణ, ప్రిన్సిపాల్ రమేష్ అన్నారు. మండలంలోని పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యాన జాతీయ సేవా పథకం సోమవారం ప్రారంభించారు. ముందుగా మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సేవా పథకం వల్ల విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, సామాజిక వ్యక్తిగత బాధ్యత పెరుగుతుందని అన్నారు. ఏడు రోజుల పాటు గ్రామాల్లో స్వచ్ఛ భారత్, పరిసరాలు పరిశుభ్రత, జెమ్స్ ఆధ్వర్యాన మెగా వైద్య శిబిరం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.రూప్‌సుందర్, అధ్యాపకులు కేశవరావు, ఝాన్సీ, భాగ్యలక్ష్మి, రాంబాబు, సౌజన్య, అలేఖ్య, వాణి, రమణ, పున్నయ్య ఉన్నారు.

మొక్కను నాటుతున్న ఈశ్వరరావు

అడుగుకో గండం... ఈ రోడ్డుకో దండం

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ మండల కేంద్రం నుంచి మామిడివలసకు వెళ్లే రహదారి పరమ అధ్వానంగా మారింది. బూర్జ నుంచి మామిడివలస వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఉన్న ఈ బిటి రహదారిపై పూర్తిగా మట్టి పేరుకుపోవడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. బురదతో నిండిన రహదారితో అనునిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నమని గ్రామస్తులు వాపోతున్నారు. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉందని,. ప్రతిరోజు బూర్జ మండల కేంద్రం నుంచి చుట్టుపక్కల గ్రామాలైన వావాం, ఉవ్వపేట, మామిడి వలస, కాఖండ్యాం, చిన్నలంకాం, పెద్దలంకాం, నారాయణపురం తదితర గ్రామాల నుంచి ప్రయాణం సాగించాల్సి ఉందని వాపోతున్నారు. అయితే ఆర్‌అండ్‌బి అధికారులు కనీసం పర్యవేక్షణ లేకపోవడంతో రహదారి ఇలా తయారైందని, వాహనదారులతో పాటు పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బూర్జ మండల కేంద్రం నుంచి నారాయణపురం వెళ్లే రహదారి

నాలుగు నెలలుగా మూతపడిన రైతుసేవా కేంద్రం

లావేటిపాలెంలో మూతపడిన రైతుసేవా కేంద్రం

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు పంచాయతీ పరిధిలోని లావేటిపాలెంలో లావేరు-2 రైతు సేవాకేంద్రం గత నాలుగు నెలలుగా విఎఎ లేక మూతపడింది. ఇక్కడ విఎఎగా పనిచేస్తున్న శాంతి ఆగస్టులో మెటర్నీటి సెలవుపై వెళ్లడం, ఇక్కడ రైతుసేవా కేంద్రం తెరవకపోవడంతో రైతులకు సేవలు అందకపోవడంతో ఏ అవసరం పడినా లావేరు రైతుసేవా కేంద్రానికి వెళ్తున్నారు. ఈ రైతుసేవా కేంద్రం పరిధిలో లావేటిపాళెం, కేసవరాయపురం, జిజవలస గ్రామాల రైతులకు వ్యవసాయ శాఖ సేవలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. విత్తనాలు, ఎరువులు అందక బాధపడుతున్నమని, జిల్లా అధికారులు స్పందించి ఇక్కడ రైతుసేవా కేంద్రానికి ఇన్‌ఛార్జినైనా నియమించాలని కోరుతున్నారు.

నేటి నుంచి గ్రిగ్స్ పోటీలు

నందిగాం : మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టెక్కలి నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీలు మంగళవారం నుంచి నిర్వహిస్తామని ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారంతా నియోజకవర్గస్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. బాలురు, బాలికల విభాగంలో వేర్వేర్వుగా నిర్వహిస్తామన్నారు. టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల నుంచి క్రీడాకారులు హాజరువుతారని తెలిపారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం నాయకుల పరామర్శ

నందిగాం : సిపిఎం మండల నాయకులు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులుగా వివిధ ప్రజా ఉద్యమాల్లో పాల్గొని సమాజ సేవలో భాగస్వాములైన సతివాడ మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులను సిపిఎం నాయకులు పాలిన సాంబమూర్తి, దాలయ్య సోమవారం పరామర్శించారు. ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సంఘ సభ్యులు

డ్వాక్రా మహిళల ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : డ్వాక్రా సంఘానికి చెందిన జోగమ్మ కిడ్నీ వ్యాధితో బాధపడుతుంది. నిరుపేద కుటుంబం కావడంతో చికిత్స పొందేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న బూర్జపాడు గ్రామ డ్వాక్రా మహిళ సంఘం రూ.26,850 సోమవారం ఆర్థికసాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. నిరుపేద కుటుంబం మందులు ఖర్చులు కూడా భరించేందుకు ఆ కుటుంబానికి భారంగా ఉంది. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు గ్రామ పెద్దలు, యువజన సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాధాకృష్ణ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పలాస : మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ జి.కనకరాజును మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. 2023 నాటి సమ్మె కాలపు ఒప్పంద జిఒను ఇవ్వాలన్నారు. 2011-12 పిఎఫ్ డబ్బులు కార్మికులు ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్మికులను పెంచి పని భారం తగ్గించాలన్నారు. మృతి చెందిన, విశ్రాంతి తీసుకున్న కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్.మురగన్, ఎం.రవి, ప్రకాష్, ముఖి పాల్గొన్నారు.

వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష

ఇచ్ఛాపురం: మద్యం తాగి బైక్ నడిపినందుకు ఇచ్ఛాపురం టౌన్ పోలీస్ మెరక వీధికి చెందిన తిప్పాన రమణను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. జడ్జి ఐదు రోజులు రిమాండ్ విధించి నరసన్నపేట జైలుకు పంపించినట్టు టౌన్ ఇన్‌ఛార్జి ఎస్ఐ జనార్ధనరావు సోమవారం తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపినా, బహిరంగంగా మద్యం తాగినా కఠిన చర్యలు తీసుకుంటాం హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే చర్యలు తప్పవని అన్నారు.